ప్రజాశక్తి
సోమవారం 11 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి






విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ఆమడదూరంలో శింగనమల అభివృద్ధి...!

◆ సాగునీటికి తప్పని తిప్పలు ◆ ఉద్యానవన పంటలకు నిలయం



ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఉద్యానవన పంటలు పండే ప్రాంతం శింగనమల నియోజకవర్గం. బంగారు పంటలు పండే భూములున్నా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇక్కడి నుంచే అత్యధికంగా మంత్రులుగా పనిచేసిన వారూ ఉన్నారు. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం ఆ తరువాత వాటిని విస్మరించడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఒకరి తర్వాత ఒకరు పాలకులు మారుతున్నారే గానీ ఇక్కడి సమస్యలు మాత్రం తొలగడం లేదు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆగిన మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ

శింగనమల నియోజకవర్గంలో సాగునీటిని అందిస్తున్నది మిడ్‌పెన్నార్. దీని కిందనున్న దక్షిణ కాలువ ఈ నియోజకవర్గం మొత్తానికి నీటిని అందించే ప్రధానమైన ప్రాజెక్టు. ఈ కాలువ ఆధునీకరణ 2017లో చేపట్టారు. రెండు ప్యాకేజీల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. ఈ ఐదేళ్లలో ఇవి పూర్తిగా ఆగిపోయాయి. కాంట్రాక్టర్ ఈ పనులు చేయలేం.. రద్దు చేయాలని నోటీసులు సైతం ఇచ్చారు. ఆధునీకరణ లేకపోవడంతో నీటి నిర్వహణలో ఇబ్బందులు తప్పడం లేదు.

చెరువులకు నీరిస్తున్నట్టు కాగితపు ప్రకటనలు

శింగనమల నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తున్నట్టు ప్రభుత్వం ఒక ఉత్తర్వులిచ్చింది. దీన్నే పెద్దఎత్తున ప్రచారం చేపడుతోంది. అయితే ఈ నీటి కేటాయింపులు చూస్తే ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదన్నది స్పష్టమవుతోంది. ప్రభుత్వం ప్రకటించినట్టు అన్ని చెరువులకూ నీరివ్వాలంటే 18 టిఎంసిల వరకు నీరు అవసరమవుతుంది. అది కూడా హంద్రీనీవా ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచిన తరువాత కేటాయింపులు జరిపారు. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం పనులు ప్రారంభం అవలేదు. అది పూర్తయ్యి చెరువులకు నీరు ఎప్పటికిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.

చాగల్లు నిర్వాసితుల గోడు అరణ్య రోదనే

పెద్దపప్పూరు మండలంలో నిర్మించిన చాగళ్లు రిజర్వాయర్ కింద ఉల్లికల్లు గ్రామం ఉంది. నీటిని పూర్తి స్థాయిలో నింపినప్పుడు గ్రామం ఆనుకుని నీరు చేరుతోంది. దీంతో తమకు పరిహారమిచ్చి పునరావాసం కల్పించాలని చాలా సంవత్సరాలుగా గ్రామస్తులు ఆందోళనలు చేస్తున్నారు. వారికి పరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాని ఇప్పటి వరకు నిధుల కేటాయింపులు జరగలేదు. పోరాటం చేస్తున్న నిర్వాసితులు మాత్రం ఇటీవలనే జైలుకు సైతం వెళ్లివచ్చారు.

ఉద్యానవన పంటలకు ఊతమేది..?

అత్యధికంగా ఉద్యనవన పంటలు ఈ ప్రాంతంలోనే పండుతాయి. ఈ పంటలకు ప్రాసెసింగ్ చేసే పరిశ్రమలేవి ఇక్కడ లేవు. రైతులు సొంతంగా సుదూర ప్రాంతాలకు మార్కెట్‌కు తరలించాల్సి వస్తోంది. అక్కడ ధరల మోసాలతోనూ రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యనవన పంటలు అమ్ముతున్న సమయంలో డబల్ సూట్‌ల తోనూ నష్టపోతున్నారు. అదే విధంగా ఇక్కడ పశు సంపద అధికం. ప్రధానంగా గొర్రెల పెంపకం ఎక్కువగా ఉంటుంది. గొర్రెల పెంపకం దారులకు సరైన ప్రోత్సహకం లేదు. ఏటా పశు గ్రాసం కోసం ఈ ప్రాంతం నుంచి కర్నాటక తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



మూతబడిన లెదర్ పార్కు

శింగనమల ఎస్సీ రిజర్వు నియోజకవర్గం కూడా కావడంతో ఇక్కడ నిదనవాడ గ్రామ సమీపంలో లేదర్‌పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో చర్మకార కార్మికులకు శిక్షణిచ్చి చర్మకార వృత్తిపై ఆధారపడిన కార్మికులకు ప్రోత్సహించాలని దీన్ని ఏర్పాటు చేశారు. కాని ఈ లెదర్‌పార్కు పూర్తిగా మూతబడింది. దీన్ని తెరిపిస్తామని ఎన్నికల్లో హామీలివ్వడంతోనే సరిపెడుతున్నారు.



శింగనమల చెరువు (ఫైల్ ఫోటో)



మిడ్‌పెన్నార్ డ్యాం

నేడు ఎస్‌బిఐల వద్ద ఆందోళనలు

◆ బిజెపి, దానికి మద్దతిచ్చే పార్టీలను ఓడించండి
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎలక్ట్రోరల్ బాండ్లకు సంబంధించి ఎస్‌బిఐ సమగ్ర వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా ఎస్‌బిఐ బ్యాంకుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలియజేశారు. ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ఎలక్రోరల్ బాండ్లను నిబంధనలకు విరుద్ధంగా సేకరించిందన్నారు. దేశంలో ఏ ఇతర పార్టీ కూడా ఇంత పెద్ద మొత్తంలో ఎలక్ట్రోరల్ బాండ్లను సేకరించలేదన్నారు. వీటికి సంబంధించిన వివరాలను ఎస్‌బిఐ బహిర్గతం చేయకుండా గోప్యత పాటించేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఈ విషయాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందన్నారు. ఇక రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి పొత్తు అనైతికం అన్నారు. రాష్ట్రాన్ని అడుగడుగునా మోసం చేసిన పార్టీ బిజెపి అన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదు... వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలకు ప్రత్యేక నిధులు విడుదల చేయలేదు.. విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు.. ఇలాంటి పార్టీతో టిడిపి పొత్తుకు వెంపర్లాడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని అడగడుగునా మోసం చేసిన బిజెపి ప్రజలు కోపంతో ఉన్నారని వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధిచెబుతారన్నారు. బిజెపితో వెళ్తున్న టిడిపి, జనసేనకు కూడా ప్రజల నుంచి ఛీత్కారం తప్పదన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, సిఐటియు నాయకులు ఆయూబ్ ఖాన్, ఆదినారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, రైతు సంఘం మండల కార్యదర్శి మారుతి, సిపిఎం నాయకులు హరి, వెంకట స్వామి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే దేశ భవిష్యత్తుకు నాంది

ప్రముఖ కవి డాక్టర్ పసునూరి రవీంద్ర

ప్రజాశక్తి -పెనుకొండ

మహిళా సాధికారతే దేశ భవిష్యత్తుకు నాంది అని ప్రముఖ కవి డాక్టర్.పసునూరి రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్ బాషా ఆధ్వర్యంలో జూమ్ అంతర్జాల వేదిక ద్వారా మహిళా దినోత్సవం సందర్భంగా జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. సుమన జయంతి అధ్యక్షత జరిగిన ఈ కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పసునూరి రవీంద్ర పాల్గొని నేటి సమాజంలో మహిళా సాధికారత అంశంపైన మాట్లాడారు. గౌరవ అతిథి, కవి కథకుడు శ్రీనివాస్ గౌడ్ స్పందన అనంత కవుల వేదిక వ్యవస్థాపకులు చంద్రశేఖర్ శాస్త్రి తదితరులు పాల్గొని నేటి సమాజంలో మహిళల పై జరుగుతున్న అకృత్యాలపై మాట్లాడారు. ఈ కవి సమ్మేళనంలో చాలామంది మహిళలు, బెంగళూరు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుండి దాదాపుగా 22 మంది కవులు పాల్గొన్నారు ఈ కవి సమ్మేళనాన్ని సోసియల్ మీడియాలో దాదాపుగా 15000 మంది వీక్షించారు.

ప్రజాసేవలో గ్రామ, వార్డు సచివాలయాలు

సచివాలయాల జిల్లా నోడల్ అధికారి టి. శివారెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించడానికి నెలకొల్పిన గ్రామ, వార్డు సచివాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సచివాలయాల జిల్లా నోడల్ అధికారి శివారెడ్డి కోరారు. గ్రామ, పట్టణాలలో ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేకుండా వారి పరిధిలో నెలకొల్పిన సచివాలయాల నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని అన్నారు. గతంలో అయితే ఏ చిన్న పనికి అయినా వీఆర్వోల నుంచి తహశీల్దార్, ఎంపిడిఒ వద్దకు వెళ్లేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అన్నారు. దాదాపు 500 వరకు వివిధ సేవలను సచివాలయాలలోనే పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. సచివాలయాల సేవల గురించి సచివాలయాల జిల్లా నోడల్ అధికారి టి.శివారెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు విషయాలను తెలియజేశారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని సచివాలయాలు ఉన్నాయి.?

జవాబు : జిల్లాలో 544 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాలలో 413 ఉండగా పట్టణ ప్రాంతాలలో 131 వార్డు సచివాలయాలు ఉన్నాయి. సుమారు 5000 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వాలంటీర్లు కూడా సచివాలయాల పరిధిలోకి వస్తారు. 50 ఇళ్లకు ఒక వాలంటరీ పనిచేస్తుంటారు. సచివాలయాలకు ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు పనిచేస్తారు. ముఖ్యమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి కేటాయించిన 50 కుటుంబాలకు అందించడంలో కీలకంగా ఉంటారు.

ప్ర : జిల్లాలో ఎన్ని సచివాలయాలకు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి.?

జ : జిల్లాలోని 544 సచివాలయాలకు గాను 280 సచివాలయాలకు భవనాలు నిర్మించడం జరిగింది.



ఇవి ఉపాధి హామీ పథకం క్రింద ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు క్రింద నిర్మించడం జరిగింది. మిగతా సచివాలయాల భవనాలు వివిధ దశలలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్ర : సచివాలయాల పరిధిలో ఏయే సేవలు అందుతున్నాయి.?

జ : సుమారు 500 దాకా సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి. ఇందులో ముఖ్యంగా ప్రజలందరికీ అవసరమైన సేవలు ఉన్నాయి. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నమోదు, ఇంటి పన్నులు, జగనన్న చేయూత, విద్యా దీవెన, ఈ బీసీ నేస్తం, అమ్మ ఒడి, విశ్వకర్మ యోజన, వాహన మిత్ర, కాపు నేస్తం తదితర పథకాలతో పాటు బస్సు, రైలు, విమానయానం టికెట్లు సైతం రిజర్వేషన్ చేయడం జరుగుతుంది. వ్యవసాయానికి సంబంధించి సన్న చిన్న కారు రైతులను గుర్తించి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంతో పాటు 1 బి ధ్రువీకరణ పత్రాలు, కొత్త రేషన్ కార్డు మంజూరు, పేరు మార్పులు ఇలా ఎన్నో సేవలు సదుపాయాలు ఒకే చోట లభ్యమవుతాయి. అధికార వికేంద్రీకరణ వల్ల ఒకే చోట ప్రజలకు కావాల్సిన సేవలు సదుపాయాలను కల్పించడం జరుగుతుంది. దీంతో ప్రజలు వ్యయ ప్రయాసలు కోర్చి అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. సచివాలయాల వ్యవస్థ ఆయా గ్రామ వార్డు పరిధిలోని ప్రజలకు ఒక వరం లాంటిదని చెప్పవచ్చు.



సచివాలయాల జిల్లా నోడల్ అధికారి టి.శివారెడ్డి

ప్ర : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహా సూచనలు ఏమిటి.?

జ : జిల్లా వ్యాప్తంగా 5000 వేల మంది సిబ్బంది అవసరం ఉండాల్సుంది. అయితే సుమారు 800 మంది సిబ్బంది కొరత ఉంది. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే సచివాలయాల వ్యవస్థ పై ప్రజలలో అవగాహన కలిగింది. సచివాలయాల సేవలను వినియోగించుకొని ప్రజలు అభివృద్ధి చెందాలని కోరుతున్నాము. పలు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి ప్రభుత్వం జమ చేస్తుంది. అయితే లబ్ధిదారులను గుర్తించడంలో సచివాలయాల సిబ్బంది పాత్ర కీలకంగా ఉంటుంది.

అన్ని చెరువులకూ నీరిస్తాం

◆ బిటిపి ఎత్తిపోతల పనులు పూర్తి చేస్తాం
◆ ఉత్తర కొరియా కిమ్‌లా జగన్
◆ సూపర్-6ను ప్రజల్లోకి తీసుకెళ్లండి
◆ శంఖారావంలో నారా లోకేష్



రాయదుర్గంలో అభిమానులతో



ఉరవకొండ శంఖారావంలో ప్రసంగిసున్న లోకేష్

ప్రజాశక్తి-ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం

టిడిపి అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులు అన్నింటినీ పూర్తి చేసి జిల్లాలో చెరువులన్నింటికీ నీరందిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. టిడిపి శంఖారావం కార్యక్రమం అనంతపురం జిల్లాలో కొనసాగుతోంది. ఆదివారం నాడు ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో శంఖారావం బహిరంగ సభలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల టిడిపి అభ్యర్థులు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభల్లో నారా లోకేష్ ప్రసంగించారు. కరువుకు నిలమైన అనంతపురం జిల్లా అభివృద్ధికి టిడిపి పాలనలో కృషి చేశామన్నారు. దేశంలో ఎక్కడ చూసినా అనంత కియా కార్లే కనిపిస్తున్నాయంటే అది చంద్రబాబు నాయుడు విజనరీ పాలన అన్నారు. అనంతపురం జిల్లా అంటే తమకు ఎంతో ప్రేమ అన్నారు. అందుకే డబుల్ ప్రేమతో ఐదేళ్లలో అనంతను టీడీపీ ఎంతో అభివృద్ధి చేసిందని తెలిపారు. కరువు సీమలో కార్ల పంట పండించి కియా అనుబంధ సంస్థల ద్వారా 50వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలియ జేశారు. విజనరీ చంద్రబాబుకు, ప్రిజనరీ జగన్‌కు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే బిటి ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకాన్ని చేపడతా మన్నారు. రాయదుర్గం జీన్స్ గార్మెంట్ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రతి గడపకూ సురక్షిత తాగునీటి కొళాయిని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. నార్త్ కొరియాలో కిమ్ నియంత పాలనలాగానే రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాల సాగించారన్నారు. ప్రశ్నించిన వారిని, ఎదురు తిరిగిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధం అన్నారు. సమయం, తేది జగన్మోహన్‌రెడ్డి చెప్తే అన్ని విషయాలపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. జగన్ అండ్ కో జె ట్యాక్స్‌ను వసూలు చేస్తూ ప్రజల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారని ఎద్దేవా చేశారు. ఓ చేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో 100 రూపాయలు ప్రజల నుంచి లాక్కుంటున్నారని విమర్శించారు. కరెంట్, ఆర్టీసీ ఛార్జీలు, ఇంటి, చెత్త పన్నులను పెంచి సామాన్యులపై భారాలు మోపాడదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అందిస్తున్న దాదాపు వంద రకాల సంక్షేమ పథనాలను రద్దు చేశాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ క్యాలెండర్‌ను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యత టిడిపి నాయకులు, కార్యకర్తలదే అన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన అనంతపురం జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌తో పాటు ఆయా నియోజకవర్గాల టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలన అవినీతి మయం

వైసిపి పాలన మొత్తం అవినీతి మయం అని నారా లోకేష్ విమర్శించారు. ఆయా నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాయదుర్గం ఎమ్మెల్యే అవినీతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పోటీ పడ్డారన్నారు. ఈసారి రాయదుర్గంలో అవినీతిపరుడు పోయి అసమర్థున్ని సమన్వయకర్తగా జగన్ నియమించారని ఎద్దేవా చేశారు. రాయదుర్గంలో టిడిపి, వైసిపి పరిపాలనలో జరిగిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమన్నారు. వైసిపి నాయకులు అంగీకరిస్తే తమ పార్టీ తరపున కాలవ శ్రీనివాసులు చర్చకు వస్తారన్నారు. ఉరవకొండ వైసిపి ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆయన, ఆయన కొడుకు కలిసి నియోజకవర్గాన్ని దోచేశారన్నారు. దొంగ ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్లు, పత్రాలు సష్టించి భూములు కొట్టేస్తున్నారన్నారు.

వైసీపీని ఆదరించండి

ప్రజాశక్తి - కదిరి టౌన్

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న వైసీపీ ని మరోమారు గెలిపించాలని ఆపార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త మాక్బుల్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 3 వ వార్డ్, జీవిమాని సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి ఆ వార్డ్ కౌన్సిలర్ బాండారు మురళి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ను ప్రజలకు వివరించారు. అలాగే బస్టాండ్ ఆవరణలోని స్థానిక ఓటర్లతో పాటు, తోపుడుబండ్ల వ్యాపారస్తులు, హోటళ్ల,కిరాణా షాపు యజమానులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళి, ఓం ప్రకాష్, వైసిపి నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మక్బూల్

నిరంకుశ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

నిరంకుశ వైసిపిని ఇంటికి సాగనంపుదామని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారధి అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిని పార్టీ సభ్యులుగా తాము అందరం స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబు నాయుడు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగాయన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని కోడిపల్లె పంచాయతీలోని నాగేపల్లి గ్రామంలో సర్పంచి మంజునాథ్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ 5లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామన్నారు.

నిరుద్యోగుల నెత్తిన జగన్ కుచ్చు టోపీ : కందికుంట

ప్రజాశక్తి కదిరి టౌన్

జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల నెత్తిన కుచ్చుటోపీ పెట్టిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. కదిరి పట్టణంలో ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కందికుంటతో పాటు బ్లూమూన్ శివశంకర్ పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయం లో నెరవేర్చలేని హామీలు నిరుద్యోగులకు ఇచ్చి అధికారం చేపట్టాక వారి నెత్తిన కుచ్చుటోపీ పెట్టారన్నారు. వైసీపీ నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో కష్టాలు పడ్డామని అన్నారు. రాష్ట్రంలోని వ్యవస్థలను జగన్ విచ్చిన్నం చేశారని విమర్శించారు. ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగన్ ను ఓటు అనే ఆయుధం తో ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీవీ అనిల్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కందికుంట, తదితరులు

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన '

పుట్టపర్తి క్రైమ్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల నుండి వినతి పత్రాలు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కదిరి టౌన్ : పట్టణం రాయచోటి రోడ్డు నందు బత్తల హరిప్రసాద్, వెంకటరమణ ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన చంద్రహాస్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ దివ్యచంద్ర నేతృత్వంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓబుళదేవర చెరువు : కేజీబీవీలో ప్రవేశానికి ఈనెల 12 నుండి అన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్. గీతాబాయి తెలిపారు. 2024-2025 ఏడాదికి సంబంధించి 6వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ఆమె తెలిపారు. ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఒ కోరారు.

ఆలయంలో చండీహోమం

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గ పాపానసేశ్వర ఆలయం లో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమానందం, సర్పంచి ఆదినారాయణ, వైస్ ఎంపీపీ ఆంజనరెడ్డి, అర్చకులు శీనస్వామి, నరసింహ శర్మ, సునీల్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



సిఐటియు రమేష్‌కు నోటీసు అందజేస్తున్న పోలీసులు





పోలీసుస్టేషన్‌లో నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా అయన పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా తనకల్లు మండలం సిపిఎం అనుబంధ సంఘాలు సిఐటియు,ఏపీ రైతు సంఘం మద్దతుగా రైలురోకో కార్యక్రమానికి బయలుదేరుతుండగా స్థానిక పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం అన్యాయమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, వివిధ డిమాండ్లతో పార్లమెంటుకు వెళ్లి వినతి పత్రం సమర్పించుటకు బయలుదేరిన రైతు సంఘాలను ఢిల్లీ సరిహద్దుల్లో కేంద్ర ప్రభుత్వం పోలీస్ బలగాలను మోహరింప చేసి ఉద్యమాలను అణిచివేసిందని విమర్శించారు.

మడకశిర : రైలురోకోకు వెళ తున్న మడకశిర ప్రాంత రైతులను ఇంటలిజెన్స్ విభాగం వారు బెదిరించడం తగదని ఈ ప్రాంత రైతులు అన్నారు. పెనుకొండ, హిందూపురం ప్రాంతాల్లో రైలురోకో నిర్వహించడానికి వెళుతున్న రైతులను పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆనంద రంగారెడ్డి, సోము కుమార్, వేమారెడ్డి, రామిరెడ్డి, రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సమస్యలపై పోరాటాలు చేస్తుంటే పోలీసులు అరెస్టు చేయడం అమానుషమన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.

తనకల్లు : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం, రైతుసంఘాల నాయకులు హెచ్చరించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా రైలురోకో కార్యక్రమానికి వెళుతున్న తనకల్లు మండలం నుంచి సిపిఎం, సిఐటియు, రైతుసంఘం నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అపలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం వివి రమణ, రమణ, సిఐటియు ఒంటెద్దు వేమన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు జతకట్టినా వైసిపిదే విజయం

మంత్రి ఉషశ్రీ చరణ్



గిరిజన జనగర్జన సభలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్ని పార్టీలు జతకట్టినా వచ్చే ఎన్నికలలో వైసీపీ దే విజయమని రాష్ట్ర శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సాయి ఆరామం సమీపంలో గిరిజన జన గర్జన సభ వైసిపి జోనల్ ఎస్టీ సెల్ కన్వీనర్ డుంగవత్ రమేష్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వైసీపీ విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. అభివృద్ధి, సంక్షేమం పరంగా ఎస్టీలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని నామినేటెడ్ పదవులతో పాటు పార్టీలో సముచిత పదవులు కట్ట బెట్టారని అన్నారు. తిరిగి మరొకసారి సీఎం జగన్ ను ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన మహిళల కోసం వారి పిల్లల విద్య కోసం ఎన్నో పథకాలను జగన్ అందించారన్నారు. 500 జనాభా ఉన్న తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. 2029 లో నియోజకవర్గ పునర్విభజన సందర్భంగా ఎస్టీలకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు విడుదల చేయడం జరుగుతుందన్నారు. చంద్రబాబు రైతులకు రుణమాఫీ చేస్తానని, డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని మాట ఇచ్చి మోసం చేశారన్నారు. ఇప్పుడు తిరిగి ఓటు అడగడానికి మోసపూరిత వాగ్దానాలతో మూడు పార్టీల కలయికతో వస్తున్నాడని గిరిజనులు మోసపోవద్దని అన్నారు. ఈ సమావేశంలో హిందూపురం పార్లమెంట్ వైసిపి అభ్యర్థి శాంతమ్మ, కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్‌బాషా, నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్ధ నాయక్, నల్లమాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గిరిజన నాయకులు తిరుపాల్ నాయక్, రవి నాయక్, పెడపల్లి శ్రీనివాస్ నాయక్, నాకే నాయక్, ఆంజనేయులు నాయక్, శివ శంకర్ నాయక్, పలువురు జడ్పిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

'టిడిపితోనే అన్ని వర్గాల అభివృద్ధి'



పార్టీలోకి చేరిన వారితో మాట్లాడుతున్న సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

టీడీపీ తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం అని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పరిగి మండలం కాలువపల్లి కి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. 15 వైసిపి కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి సవితమ్మ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేసి టిడిపితోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ బాగు పడాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి అందరూ కలసి కట్టుగా పనిచేద్దామన్నారు. జగన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు చంద్రమౌళి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి,మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు,జిల్లా కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, మాజీ ఎంపిటీసీ క్రిష్టప్ప, సోమందేపల్లి టౌన్ ప్రెసిడెంట్ సూరి, మాజీ ఎంపీపీ నరసింహులు,తిరుపతయ్య , సుబ్బరాయుడు, సానిపల్లి మాజీ డీలర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని శ్యాపురం, కంబాలపల్లి ,బీదానపల్లి గ్రామాల్లో పెనుకొండ నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, చంద్రమౌళి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట రామిరెడ్డి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఆంజనేయులు ,మాజీ ఎంపీపీ నరసింహులు, సర్పంచి మంజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి : టిడిపి

ప్రజాశక్తి కదిరి టౌన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసిపికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోద దేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి పట్టణం 35వ వార్డు లో ఇంటింటా ప్రచారం కొనసాగించారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కొయ్య రాజేంద్ర నాయుడు గంగయ్య, మహిళ నాయకురాలు పర్వీన్ భాను, గంగరత్నమ్మ , ఫరీదా, సుశీల ప్రమీల, ఐటీడీపీ మన్సూర్, జునైద్ తదితరులు పాల్గొన్నారు



కరపత్రాన్ని అందజేస్తున్న కందికుంట యశోదాదేవి

కూటమితో మరింత బలం : పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

కూటమితో టిడిపి బలపడిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితులను చక్కబెట్టేందుకే చంద్రబాబునాయుడు వచ్చే ఎన్నికల్లో పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చేశారని విమర్శించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న 'పల్లె'



విరాళం అందజేస్తున్న మనోజ్

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పరగి మండలం శ్రీరంగరాజుల పల్లి గ్రామంలో చేపట్టిన ఆలయ నిర్మాణానికి వైసిపి నాయకులు మనోజ్ విరాళం అందించారు. ఈ మేరకు ఆయన రూ.50వేలను ఆదివారం ఆలయ కమిటీ నిర్వహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, సాదు శెట్టి సంఘం శ్రీధర్, ఆనంద్, నాగార్జున, జుబేర్, మనోజ్ మిత్ర మండలి శేషు, శాంత రాజు, శ్యామ్ బాబు, ప్రణయ్ రెడ్డి, సుమన్, చరణ్, చిన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

పాతికేళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు



తమ గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పాతికేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒక్కచోట చేరారు. పాతికేళ్ల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు రవి, కాశీఫ్, గోపి, రాఘవేంద్ర, రాజశేఖర్, మల్లన్న, బండ జనార్ధన్, జయకృష్ణ, కొండన్న, అప్పిరెడ్డిగారి సురేష్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాతికేళ్ల నాటి తమ స్నేహితులను కలిపారు. వారు కలవడమే కాకుండా అలనాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సైతం పిలిచి సత్కరించారు. గురువులు నాగప్రసన్న, పోలయ్య, లక్ష్మీదేవి, శ్రీదేవి, మేరి, సుధాకర్, నారాయణస్వామి, వెంగముని, వెంకటేష్, నాగేష్, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, రంగయ్య, గిరి, కొండయ్య, వెంకటస్వామి, అశ్వర్ధనారాయణ, సబీరాకానుమ్, రామలింగయ్యలను పూర్వ విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా ట్రస్ట్ ఏర్పడ్డారు. ఈ ట్రస్టు తమ స్నేహితుల్లో ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు సహాయపడుతుందని నిర్వాహకులు తెలిపారు. దీంతోపాటు తాము చదువుకున్న పాఠశాల 'అభివద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ముక్కడి పేటలో ఉన్నా రినేన్స్ ముస్తఫా పాఠశాలలో కరస్పాడెంట్ ముస్తఫా ఆలీ ఖాన్ ఆధ్వర్యంలో బెంగళూరు సప్తగిరి అసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు 250 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఇందులో వివిధ రోగాలతో బాధపడుతున్న 14 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేశామని వీరికి బెంగళూరు సప్తగిరి అసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారుక్ ఖాన్, అసుపత్రి వైద్యులు ఆలూరు శేఖర్, జయవర్ధన్ గౌడ్, వైద్య అరోగ్య సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం బీబీజాన్, ఉబేదుల్లా హుసైన్, డాక్టర్ సల్మాన్ ఆలీ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, సాఖీబ్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సంపద సృష్టించే నాయకుడు చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డులో ఆదివారం టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలతో పాటు డిక్లరేషన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫణికుమార్, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుసేన్; రాళ్లపల్లిషరీఫ్, కత్తులబాబ్జి, కత్తుల సునీత, మాధవరెడ్డి, గోసలశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం దుకాణంలో భారీ చోరీ

రూ.10 లక్షల నగదు రూ. 3 లక్షల మద్యం అపహరణ

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లిలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... బత్తలపల్లిలోని ధర్మవరం రోడ్డుకు గల బ్యాంకు సమీపంలో ప్రభుత్వం మద్యం దుకాణం ఉంది.అందులో సూపర్‌వైజర్‌గా విజయ్‌కుమార్, సేల్స్‌మ్యాన్లుగా రామచంద్రా రెడ్డి. నారాయణస్వామి నాయక్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మద్యం విక్రయించగా వచ్చిన నగదును మద్యం దుకాణంలో ఏర్పాటు చేసిన లాకర్లో ఉంచి మరుసటి దినం బ్యాంకుకు వెళ్లి డిపాజిట్ చేస్తారు. అయితే శివరాత్రి పండుగ సందర్భంగా రెండు రోజులుగా బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దీంతో గత రెండు రోజులుగా విక్రయించగా వచ్చిన డబ్బును శనివారం రాత్రి లాకర్‌లో ఉంచి యధావిధిగా దుకాణాన్ని మూసివేసి వెళ్లారు. అయితే దుకాణం వద్ద సరైన సౌకర్యాలు లేకపోవటం, దుకాణం లోపలికి ఉండటం దొంగలకు అనువుగా మారింది. దుండగులు శనివారం రాత్రి సమయంలో దుకాణానికి వేసిన తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు ఏర్పాటు చేసిన హార్డ్‌డిస్క్‌ను తీసుకున్నారు. దుకాణంలోని లాకర్‌ను ధ్వంసం చేసి అందులో ఉంచిన రూ.10,98,550లు నగదును దోచుకున్నారు. అనంతరం రూ.3.33.310ల విలువ చేసే వివిధ రకాల మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లి పోయారు. ఈ చోరీతో మొత్తం రూ.14,31,860లు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఇంత తతంగం జరుగుతున్నా వాచ్‌మెన్లు నరసింహులు, రామచంద్ర అప్రమత్తం కాలేదు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచిన వాచ్‌మెన్ నరసింహులు దుకాణం తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళన చెంది వెంటనే సూపర్‌వైజర్, సేల్స్ మెన్లకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. సమాచారం అందుకున్న ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ బాలకృష్ణ, ఎక్సైజ్ సిఐ గౌరీప్రియ, ఎస్ఐ నారాయణ, డిపో సిబ్బంది, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు. ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎఎస్ఐ సోమశేఖరమూర్తి పోలీస్ సిబ్బంది సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. దుకాణం సమీపంలోని బ్యాంకులోనూ, దుకాణాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. పుట్టపర్తి నుంచి వచ్చిన క్లూస్ టీం ఆనవాళ్లను సేకరించింది. సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సిఐ ఆరోహణరావు తెలిపారు.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మినీబస్సు బోల్తా.. డ్రైవర్ మృతి

ధర్మవరంటౌన్ : పట్టణంలోని పోతుకుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ మినీ బస్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... బత్తలపల్లి మండల చెందిన టీచర్స్ కాలనీకి చెందిన శివకుమార్ (36) కనగానపల్లి గ్రామానికి చెందిన తన తోటి శివ భక్తులతో పాటు తన మినీ బస్సులో తనే డ్రైవింగ్ చేసుకుంటూ శ్రీశైలం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తన తోటి శివ మాల ధారణ వ్యక్తులను కనగానపల్లిలో వదిలి ధర్మవరం వస్తున్నాడు. పోతుకుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మినీబస్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శివకుమార్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు శివకుమార్‌కు భార్య చంద్రకళతో పాటు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.



శివకుమార్ (ఫైల్ ఫొటో)

గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి గాయాలు

హిందూపురం : పట్టణంలోని మేళాపురం సమీపంలో ఉన్న బ్యాంక్ కాలనీలో ఓ ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన లక్ష్మీదేవి తన ఇంటిలో వంట చేస్తుండగా ఒక్క సారిగ గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇంటి పై కప్పు రేకులు, తలుపులతో పాటు ఇంటి సరుకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవితో పాటు భరత్, చిన్నారులు అఖిల, వర్షిత తీవ్రంగా గాయపడ్డారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

అగ్నిగుండంలోకి జారిపడి వ్యక్తికి గాయాలు

అమరాపురం : మండల పరిధిలోని హేమావతి హేంజెరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా ప్రమాదం జరిగింది. ఉత్సవాలను చూడడానికి వచ్చిన వ్యక్తి అగ్నిగుండంలోకి జారిపడి గాయపడ్డాడు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశానికి ముందు హెంజెరప్ప (35) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జాగి అగ్నిగుండంలో పడ్డాడు. ఈ ప్రమాదంలో హెంజెరప్ప కాళ్లు, చేతులు కాలి బొబ్బలు ఎక్కాయి. దీంతో స్థానికులు అతడిని హేమావతి ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం తూమకుంట టెక్స్‌పోర్టు గార్మెంట్ పరిశ్రమ సమీపంలో ఉన్నా పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలయని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. చిన్న గుడిసె కింద కుర్చుని తన తలను తల పాగతో కట్టెకి కట్టి, కుర్చొని అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా అసుపత్రికి తరలించారు. నిజానిజాలు పోలీసు విచారణలో తెలియాల్సుంది.

కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి మడకశిర

ఈనెల 14వ తేదీన నియోజకవర్గంలోని 340 గ్రామాలు 20 వార్డులకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కె.సుధాకర్ తెలిపారు. ఆదివారం నీలకంఠాపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే నియోజకవర్గంలో ప్రతి గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తామన్నారు. సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరా రెడ్డి ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. ఈనెల 14వ తేదీన మడకశిర పట్టణంలో ఆదిరెడ్డి పాళ్యం లో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభించిన అనంతరం వైఎస్‌ఆర్ సర్కిల్ లో జరుగు 340 గ్రామాలు, 20 వార్డుల ప్రతినిధులతో సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం అహలే సున్నతుల్ జమాత్ కమిటీని పట్టణ సమీపంలో ఉన్న పిర్ భక్తర్ వలి దర్గాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా సదర్ చౌక్ పెనుగొండ దర్గా పీఠాధిపతి తాజ్ బాబాను ఎంపిక చేయడంతో పాటు హిందూపురం హలేస్ ఉన్నతుల్ జామ కమిటీ అధ్యక్షులుగా మహబూబ్ దోలా, ఉపాధ్యక్షులుగా రఫిక్, ఇద్రిస్ సాబ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రెహమాన్, సహాయ కార్యదర్శిగా షేక్ అజ్మతుల్లా, ట్రెజరర్ గా ఎన్ షబ్బీర్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ అహలే సున్నతులు జమాత్ కు సంబంధించిన పనులు చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు.